ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలి

– జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా వివిధ రాజకీయ పార్టీలు తాము చేస్తున్న బహిరంగ సభలు, ఎస్.ఎం.ఎస్. ప్రచారాలను ఎన్నికల నిబంధనల ప్రకారం 48 గంటల వ్యవధిలో భాగంగా ఈ నెల 28న సాయంత్రం 5 గంటలకు ముగించాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం 72 గంటల వ్యవధిలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి నిబంధనలను ఉల్లంఘిస్తే భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



జవహర్‌నగర్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు

జవహర్‌నగర్: జర్నలిస్టులపై దాడి చేసి చంపుతానని బెదిరిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని జవహర్‌నగర్ జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేశారు. జర్నలిస్టులపై దాడికి నిరసనగా సోమవారం జవహర్‌నగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిలో అక్రమంగా తరలిస్తున్న మట్టిమాఫియాను అడ్డుకునేందుకు ఫొటోలు తీస్తున్న జర్నలిస్టులపై నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు అకారణంగా దూషించడమే కాకుండా రాళ్లతో దాడి చేశారన్నారు. జర్నలిస్టులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. జర్నలిస్టులపై దాడికి పాల్పడినా, దూషించినా చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టు శంకరాచారిపై దాడికి పాల్పడిన నర్సింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జర్నలిస్టులు అమర్, శంకరాచారి, యాదగిరి, సత్యనారాయణ, ప్రశాంత్, కిరణ్, రాము, రమేష్‌చారి, స్వామి, పవన్, గోపాల్‌చారి, వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మల్లారెడ్డి పంచే డబ్బులు తీసుకొని.. కాంగ్రెస్‌కు ఓటేయాలి

మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి ఓటమిని అంగీకరించి విచ్చలవిడిగా పార్టీ కార్యకర్తలతో డబ్బు పంపిణీ చేస్తున్నారని, మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మంత్రి మల్లారెడ్డి అధికారాన్ని, అధికారులను అడ్డం పెట్టుకొని ఓటరుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. జవహర్‌నగర్, బోడుప్పల్, పీర్జాదిగూడ, ఘట్‌కేసర్, గుండ్లపోచంపల్లి పురపాలక సంఘాలతో సహా అన్ని మండలాల్లో డబ్బులు పంపిణీ చేస్తున్నారన్నారు. వడ్డీ మాఫీ చేయలేని మంత్రి మల్లారెడ్డి సిగ్గు లేకుండా డ్వాక్రా మహిళలకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం రిటర్నింగ్ ఆఫీసర్‌తో సహా జిల్లా ఎన్నికల అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదన్నారు. అవినీతి మల్లారెడ్డిపై ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రజలు మల్లారెడ్డి పంచే డబ్బులు తీసుకొని కాంగ్రెస్‌కు ఓటు వేయాలని కోరారు.

అక్రమంగా తరలిస్తున్న మద్యం స్వాధీనం



మేడ్చల్: మేడ్చల్ నుంచి మెదక్ జిల్లా తూప్రాన్‌కు అక్రమంగా మద్యం తరలిస్తుండగా మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు దాడి చేసి మద్యాన్ని పట్టుకుని కారును సీజ్ చేశారు. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలం రంగాయిపల్లికి చెందిన సుధానం భానుచందర్ కారులో రూ.17,550 విలువ కలిగిన 9 కాటన్ల బీర్లను తరలిస్తుండగా రూట్‌వాచ్ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు.



ఆలయాలకు కార్తీక శోభ

మేడ్చల్: కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం మేడ్చల్, గుండ్లపోచంపల్లి, ఘట్‌కేసర్ మున్సిపాలిటీల్లోని దేవాలయాల్లో మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ఇళ్లలో ఉదయం తులసి కోటలకు, ఉసిరి చెట్లకు పూజలు చేశారు. నోములు, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఆలయాల్లో దీపార్చన కార్యక్రమాలు నిర్వహించడం, శివుడికి అభిషేకాలతో ఆలయాలు కిటకిటలాడాయి. గౌడవెల్లిలోని రామలింగేశ్వర ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.



కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మొద్దు

బీఆర్ఎస్ మేడ్చల్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి



ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ ప్రచారసభలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్ జోన్‌బృందం: అధికారం ఇస్తే అభివృద్ధి చేస్తామంటున్న కాంగ్రెస్ పార్టీ మాయమాటలు నమ్మొద్దని బీఆర్ఎస్ మేడ్చల్ అసెంబ్లీ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం మేడ్చల్ నియోజకవర్గం ఘట్‌కేసర్ మండలంలోని కొర్రెముల్, వెంకటాపూర్, మాదారం, ఫకీర్‌టెక్యతండా, కాచవాని సింగారం, కీసర మండలంలోని తిమ్మాయిపల్లి, నర్సంపల్లి, మూడుచింతలపల్లి మండలంలోని జగ్గంగూడ, కేశవరం, నాగిశెట్టిపల్లి, మూడుచింతలపల్లి, లక్ష్మాపూర్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎందుకు అభివృద్ధి చేయలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు తెలంగాణలో ఇంటింటికీ అందుతున్నాయని, తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధి మాయమై అవినీతి, అక్రమాలు ఉంటాయన్నారు. ఈ నెల 30న జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి నియోజకవర్గ ప్రజలకు మరోసారి సేవ చేసే అదృష్టం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సంస్కృతి టౌన్‌షిప్ అభివృద్ధికి కృషిచేస్తా..

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం సంస్కృతి టౌన్‌షిప్‌లో సీనియర్ సిటిజన్స్‌తో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి పాల్గొని మాట్లాడుతూ.. టౌన్‌షిప్‌లో ఇప్పటికే గుడి, పార్కు, జిమ్, రోడ్లు, వంటి అనేక వసతులు కల్పించామన్నారు. కోర్టు కేసుల నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్, కమ్యూనిటీ హాల్ ఏర్పాటును ఈసారి గెలిచిన తర్వాత పూర్తి చేస్తానన్నారు. టౌన్‌షిప్‌కు గేటెడ్ కమ్యూనిటీ హోదా కల్పించడం హెచ్ఎండీఏ పరిధిలో ఉందన్నారు. కారు గుర్తుకు ఓటేసి గెలిపిస్తే టౌన్‌షిప్ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్ హరిప్రసాద్‌రావు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, సీనియర్ సిటిజన్స్, మహిళలు, టౌన్‌షిప్‌వాసులు పాల్గొన్నారు.

గుట్టలో ప్రత్యేక పూజలు...

కార్తీక పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉదయం మంత్రి మల్లారెడ్డి కీసర గుట్టలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో జవహర్‌నగర్ మేయర్ కావ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కీసర రామలింగేశ్వర స్వామి ఆలయంలో కార్తీక పూజల్లో మంత్రి మల్లారెడ్డి



సంస్కృతి టౌన్‌షిప్‌లోని సీనియర్ సిటిజన్స్‌తో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి



నాగిశెట్టిపల్లి ప్రచారంలో మల్లారెడ్డి



జగ్గంగూడలో ఎన్నికల ప్రచారంలో మల్లారెడ్డి

అభ్యర్థుల ఖర్చులను పకడ్బందీగా నమోదు చేయాలి



సాక్షి, మేడ్చల్ జిల్లా: అభ్యర్థుల ఎన్నికల ఖర్చులను పకడ్బందీగా నమోదు చేయాలని భారత ఎన్నికల సంఘం స్పెషల్ ఎక్స్పెండీచర్ అబ్జర్వర్ బాలక్రిష్ణణ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఐదు నియోజకవర్గాలలో చేపట్టిన ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక జిల్లా వ్యయపరిశీలకులు ప్రేమ్ ప్రకాశ్ మీనా, బాలా సాహెబ్ బాపూరావు, రాచకొండ అదనపు పోలీస్ కమిషనర్ తరుణ్ జోషి, డీసీపీలు శబరీష్, జానకి, ఎంసీసీ, ఎంసీఎంసీ, జీఎస్టీ, వాణిజ్య పన్నుల శాఖ, ఎక్సైజ్ శాఖ, నోడల్ అధికారులు, ఎన్నికల పరిశీలకులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అన్ని రకాల నగదు, మద్యం, బహుమతులపై ప్రత్యేక నిఘా పెంచాలని, పోటీలో ఉన్న అభ్యర్థుల బ్యాంకు ఖాతాలను పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని బాలక్రిష్ణణ్ తెలిపారు. అనుమానిత బ్యాంక్ లావాదేవీలు, లక్ష దాటిన ట్రాన్సాక్షన్లు పరిశీలించి బ్యాంకులపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్టేట్ జీఎస్టీ, సెంట్రల్ జీఎస్టీ అధికారులు గోదాములను తనిఖీ చేయాలని, ప్రలోభపరిచే ఎలాంటి వస్తువులనైనా, బహుమతుల పట్ల క్షేత్రస్థాయిలో నిఘా ఉంచాలన్నారు. సోషల్ మీడియా వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఇన్‌స్టాగామ్‌లను గమనిస్తూ వ్యయ వివరాలు సమర్పించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు.

ఏ మాత్రం నిర్లక్ష్యం వద్దు

సాక్షి, మేడ్చల్ జిల్లా: కీసర మండలం భోగారంలోని హోలీమేరి ఇంజినీరింగ్ కాలేజీలోని ఎన్నికలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలను సోమవారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియతో కలిసి ఐదు శాసనసభ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ గదుల్లో ఏర్పాట్లను ఆయన స్వయంగా పర్యవేక్షించడంతో పాటు పలు సూచనలు చేశారు. కౌంటింగ్‌కు హాజరయ్యే సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లకు వేర్వేరు మార్గాలు ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ నిర్వహణ కోసం అవసరమైన బారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. కౌంటింగ్ భవనం ఆవరణలో గ్రౌండ్ లెవెలింగ్ చేయాలన్నారు. కౌంటింగ్ నిర్వహణ సమయంలో ఎన్నికల పరిశీలకుల కోసం ప్రత్యేక గదులు, అందులో సీసీ కెమెరాలు, వేగవంతమైన నెట్ సౌకర్యం, కంప్యూటర్లు, సీటింగ్ ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. కౌంటింగ్ కేంద్రంలో ఐదు నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ హాళ్లు, స్ట్రాంగ్ రూములను పరిశీలించిన కలెక్టర్, అక్కడ చేయాల్సిన ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. కౌంటింగ్ హాళ్లలో పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా చూడాలన్నారు. జిల్లా ఎన్నికల అధికారి వెంట రిటర్నింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



డంపింగ్ యార్డు పొగతో అత్వెల్లివాసుల తిప్పలు



అత్వెల్లి డంపింగ్ యార్డు నుంచి వెలువడుతున్న పొగ

మేడ్చల్: అత్వెల్లి శివారులో మున్సిపాలిటీ వారు ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డుతో గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓవైపు దుర్వాసన.. మరోవైపు పొగతో ఉదయం, సాయంత్రం వేళలో గ్రామ ప్రజలు అవస్థలు పడుతున్నారు. డంపింగ్ యార్డులో చెత్తను రీసైక్లింగ్ చేసే విధానం లేకపోవడంతో సిబ్బంది చెత్తను ప్రతిరోజూ సాయంత్రం వేళలో తగులబెడుతున్నారు. దీంతో దట్టమైన పొగలు గ్రామంలో వ్యాపించడంతో గ్రామస్తులు తీవ్రంగా అవస్థలు పడుతున్నారు. నిత్యం ఇదే దుస్థితి ఉండటంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

వజ్రేష్‌కు పలు పార్టీల అభ్యర్థుల మద్దతు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని పలువురు అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థులు ప్రకటించారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో శ్రమజీవి పార్టీ అభ్యర్థి బోయిన్ దుర్గాప్రసాద్ యాదవ్, భరోసా పార్టీ అభ్యర్థి ఏసయ్య, స్వతంత్ర అభ్యర్థులు కంది వెంకటాచారి, ఎస్.అనిల్ కుమార్ మాట్లాడారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం అభ్యర్థి తోటకూరి వజ్రేష్ యాదవ్ సమక్షంలో వారు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. ఆయన విజయం కోసం శాయశక్తులా కృషి చేస్తామన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ గాలి వీస్తోందని, ప్రజలంతా మార్పు కోరుకుంటున్నారని, తప్పకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు.



తెలంగాణలో కాంగ్రెస్‌కే అధికారం

- కేరళ మాజీ హోంమంత్రి రమేష్ చెన్నితాల
- నియోజకవర్గంలో కాంగ్రెస్ బైక్ ర్యాలీలు

శామీర్‌పేట్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని కేరళ మాజీ హోంమంత్రి రమేష్ చెన్నాల అన్నారు. మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ గెలుపే లక్ష్యంగా సోమవారం దమ్మాయిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి అభ్యర్థి తోటకూర వజ్రేష్‌యాదవ్‌తో కలిసి కేరళ మాజీ హోంమంత్రి రమేష్ చెన్నితాల హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, ప్రజా ఆశీర్వాదంతో ఈ ఎన్నికల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారంటీలతో సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందని, ఈసారి తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారని మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి వజ్రేష్‌యాదవ్ తెలిపారు.

కాంగ్రెస్ బైక్ ర్యాలీ..

ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మామిండ్ల ముత్యాలుయాదవ్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శివారెడ్డిగూడలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన బైక్ ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా, ఏదులాబాద్ రోడ్డు, ఎన్ఎఫ్‌సీనగర్, మున్సిపల్ కార్యాలయం, రైల్వేగేటు, బాలాజీనగర్, గాంధీనగర్, కొండాపూర్, ఈడబ్ల్యూఎస్ కాలనీ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికార పార్టీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



దమ్మాయిగూడలో మాట్లాడుతున్న వజ్రేష్‌యాదవ్



దమ్మాయిగూడ సమావేశంలో కేరళ మాజీ హోంమంత్రి రమేష్ చెన్నితాల



ఘట్‌కేసర్‌లో బైక్ ర్యాలీ

నేటి సాయంత్రం.. ప్రచారం బంద్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రధాన పార్టీలు ఎక్కువ సీట్లు దక్కేలా.. ఓట్ల పెంపుపై ప్రత్యేక దృష్టి పెడుతూ ఎన్నికల ప్రచార హోరు తారస్థాయికి తీసుకెళ్తున్నారు. అధిక ఓట్లు, సీట్లు సాధించడానికి అన్ని అవకాశాలను అందిపుచ్చు కొనేందుకు అభ్యర్థులు పడరాని పాట్లు పడుతున్నారు. ఎత్తులకు పైఎత్తులతో వ్యూహాత్మకంగా అడుగులేస్తూ ఆధిపత్యాన్ని చాటేందుకు యత్నిస్తున్నాయి. జిల్లాలో ఐదు శాసనసభ స్థానాల్లో వీలైనన్ని ఎక్కువ సీట్లు సొంతం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు కృతనిశ్చయంతో ముందుకు సాగుతున్నాయి. పార్టీల నుంచి విద్యాసంస్థల అధినేతలు, వ్యాపారవేత్తలు అసెంబ్లీ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు ప్రయత్నిస్తుండటంతో ఎన్నికల ప్రచారం తారస్థాయికి చేరింది. ఈసారి అన్ని పార్టీలు ప్రజల వద్దకు వెళ్లి ఓటర్ల మద్దతు కూడగట్టుకోవడంలో బిజీ అవుతున్నాయి. గత ఫలితాల సంగతి ఎలాఉన్నా.. ఈసారి గెలుపే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి.

ఈ ఎన్నికల్లో అభివృద్ధి.. హామీలే ప్రధానాస్త్రం

ప్రధాన పార్టీలు తమకున్న బలాల ఆధారంగా ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. రాష్ట్రంలో మూడోసారి అధికారంలోకి వస్తే అభివృద్ధి ఆగకుండా మరింత ముందుకు సాగుతుందని బీఆర్ఎస్ నేతలు హామీలిస్తున్నారు. తమ పార్టీ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటేనని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేయడంతో పాటు తమ సర్కారు ఏర్పాటైతే అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ప్రచారం చేస్తోంది. ఆరు గ్యారంటీల హామీలతో పాటు వివిధ డిక్లరేషన్లను వివరిస్తూ ఓట్లు అడుగుతున్నారు. ఇంకోవైపు బీజేపీ కేంద్రంలో సర్కారు తమదే కావడం వల్ల బస్తీలు, పట్టణాలు, గ్రామాల నుంచి మొదలుకొని జిల్లాస్థాయి వరకు నిధులను పలు అభివృద్ధి పనులకు అందించామని ప్రచారం చేస్తోంది. ముఖ్యంగా యువతను తమ బలంగా బీజేపీ భావిస్తోంది.

◆ ఈ సారి ప్రధాన పార్టీల్లో బలమైన అభ్యర్థులు ఉండటంతో ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోవడం లేదు. ఓవైపు ప్రత్యర్థులపై మాటల యుద్ధాన్ని ప్రకటిస్తూనే.. తమనెందుకు గెలిపించాలో కూడా వివరిస్తున్నారు. పార్టీ ముఖ్య నేతల ప్రచారంతో ఊపు రావడం ఒకింత లాభాన్ని చేకూరుస్తుండగా.. ఆయా పోలింగ్ బూత్ కమిటీల వారీగా గట్టిగానే కసరత్తును చేస్తున్నాయి. ప్రతి పోలింగ్ కేంద్రంలో వీలైనన్ని ఎక్కువ ఓట్లను రాబట్టాలనే కృతనిశ్చయంతో ప్రధాన పార్టీలు కసరత్తు చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు పార్టీ ముఖ్యులతో సమాలోచనలు, సర్వేలతో తమ స్థానాన్ని గుర్తిస్తూ, విజేతలుగా నిలిచేందుకు అవసరమైన ఎత్తుగడలతో ముందుకు సాగుతున్నారు.

ఐదు నియోజకవర్గాలు.. బరిలో 126 మంది అభ్యర్థులు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో ఐదు శాసనసభ నియోజకవర్గాలు ఉండగా, 126 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. మేడ్చల్ నుంచి 22 మంది అభ్యర్థులు రంగంలో ఉండగా, బీఆర్ఎస్ నుంచి మంత్రి చామకూర మల్లారెడ్డి, కాంగ్రెస్ నుంచి తోటకూర వజ్రేష్ యాదవ్, బీజేపీ నుంచి ఏనుగు సుదర్శన్‌రెడ్డి పోటీ పడుతున్నారు. అలాగే, మల్కాజిగిరిలో 33 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా, ప్రధాన పార్టీల నుంచి మైనంపల్లి హన్మంతరావు(కాంగ్రెస్), మర్రిరాజశేఖర్‌రెడ్డి(బీఆర్ఎస్), ఎన్.రామచంద్రరావు(బీజేపీ) తలపడుతున్నారు. కుత్బుల్లాపూర్‌లో 15 మంది అభ్యర్థులు బరిలో ఉండగా, ప్రధాన పార్టీల నుంచి వివేకానంద(బీఆర్ఎస్), కూన శ్రీశైలంగౌడ్(బీజేపీ), కొలన్ హన్మంతరెడ్డి (కాంగ్రెస్) పోటీ పడుతున్నారు. కూకట్పల్లిలో 24 మంది అభ్యర్థులు నిలువగా, ప్రధాన పార్టీల నుంచి మాధవరం కృష్ణారావు (బీఆర్ఎస్), బండి రమేష్(కాంగ్రెస్), ఎం.ప్రేమ్‌కుమార్ (జనసేన)లు పోటీ పడుతున్నారు. ఉప్పల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి 32 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా, ప్రధాన పార్టీల నుంచి బండారి లక్ష్మారెడ్డి బీఆర్ఎస్), ఎం.పరమేశ్వర్‌రెడ్డి(కాంగ్రెస్), ఎన్ఎస్ఎస్ ప్రభాకర్ (బీజేపీ) తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.